ప్రజాశక్తి

సోమవారం 23 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కౌన్సిలింగ్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎంటిఎస్ టీచర్ల నిరసన

8లో

నేడు గంగవరంలో లోకేష్ పర్యటన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్చూరు నియోజకవర్గం లోని ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలో సోమవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చిలకలూరిపేట బైపాస్ మార్గంలో మార్టూరు మీదుగా ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అల్పాహారం అనంతరం ఎమ్మెల్లే ఏలూరి సాంబశివరావుతో కలిసి జాతీయరహదారి మీదుగా ముప్పవరం, పంగులూరు, అరికట్లవారిపాలెం మీదుగా గంగవరం గ్రామం చేరుకుంటారు. అనంతరం ఇంకొల్లు సమీపంలోని డివిఆర్ సైనిక పాఠశాల వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ప్రతినిధులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించే ర్యాలీలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని మంత్రి లోకేష్ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

వెనుకబాటుకు ఏదీ చేయూత.?

- ప్రకటనకే పరిమితం చేసిన కేంద్రం
- అభివృద్ధికి నిధులేవీ.?
- ఎన్నో ఆందోళనలతో జిల్లా వెనుకబాటు గుర్తింపు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వామపక్ష పార్టీలు.. ప్రజాసంఘాలు ముఖ్యంగా సిపిఎం జిల్లా వెనుకబాటు గుర్తింపు కోసం అప్పట్లో ఆందోళనలు చేపట్టింది. దశలవారీగా ఆందోళనలు చేసిన వారిపై కేసులు కూడా పెద్దసంఖ్యలో నమోదయ్యాయి. జడ్పీ కార్యాలయాల వద్ద కూడా పెద్దఎత్తున బైఠాయింపులు చేశారు. తీర్మానాలు పంపారు. ఎట్టకేలకు జిల్లా వెనుకబాటుపై కేంద్రం స్పందించింది. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించింది. రాష్ట్ర విభజన జరిగినప్పుడే ఈ గుర్తింపులో జిల్లాకు అన్యాయం జరిగింది. ఏటా ఇచ్చే నిధులను కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఆందోళనలు ఒత్తిళ్ల ఫలితంగానే ఇప్పుడు జిల్లాను వెనుకబడినట్లు గుర్తించారు. అయితే వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం నుంచి చేయూత కనిపించడం లేదు.

.జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ అంటూ ఏమీ రాలేదు. నిధల ప్రస్తావనే రావడం లేదు. కేంద్రం నుంచి వివిధ పథకాల రూపంలో వచ్చే నిధులను రాష్ట్రం దారి మళ్లిస్తుందా? అనేదీ ఆలోచించాలి. ఏం జరిగిందో తెలియదు గానీ జిల్లా వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం నుంచి నిధులు వచ్చినట్లు సమాచారం లేదు. ఏడాదిలో ఈ రూపంలో ఏ పనులూ చేపట్టలేదు. విజన్ డాక్యుమెంట్లు రూపొందించారు. వాటికి నిధుల్లేవు. తర్వాత పి4 ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అంతా ప్రైవేటుపరం చేసే దిశగా అడుగులు పడ్డాయి. ఇప్పుడు పి4 అంటే సంపన్నులు పేదలను దత్తత తీసుకోవడం అనే నిర్వచనం ముందుకు వచ్చింది. ఇది సాధ్యమా? అనేది పాలకులే సమాధానం చెప్పాలి. జిల్లా వెనుకబాటు కొనసాగుతోంది. ఆనాడు జిల్లా ఏర్పాటు సమయంలో మూడు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలతో అనుకున్న లక్ష్యం కూడా నెరవేరలేదు. వెనుకబడిన ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాగా చేస్తే అభివృద్ధి చెందుతుందని ఆశించారు. 1972 నుంచీ ఇదే పరిస్థితి. జిల్లాలో పెద్దగా వచ్చిన పెనుమార్పులు ఏమీ లేవు. నాగార్జున సాగర్ కాలువ, కొన్ని ఎత్తిపోతల ▶ 2లో

మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు పోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

5లో

సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలు చేస్తే కఠినచర్యలు

కలెక్టర్ వెంకటమురళి

8లో

పొగాకు నిల్వకు గోడౌన్లు కరువు

- 25 మిలియన్ కిలోల నల్లబర్లీ నిల్వకు ఇక్కట్లు
- మార్క్‌ఫెడ్ ద్వారా కొన్న పొగాకు నిల్వ చేసేందుకు ఏలూరి, అధికారుల యత్నాలు

గోడౌన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-పర్చూరు, బాపట్ల జిల్లా

జిల్లాలో రైతులు సాగు చేసిన నల్లబర్లీని కొనేందుకు పొగాకు కంపెనీలు ముందుకు రాకపోవడంతో రైతుల వద్ద నిల్వ ఉన్న నల్లబర్లీని పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా కొనేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు రూ.300 కోట్ల నిధులను ఇందుకోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటించింది. కానీ కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకును నిల్వ చేసేందుకు కావలసిన గోడౌన్లు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం వెతుకులాట మొదలుపెట్టారు. పొగాకు కొనుగోలు వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గత రెండు రోజులుగా గోడౌన్ల కోసం జిల్లాతో పాటు పక్క జిల్లాలో కూడా రైతులు, అధికారుల ద్వారా వాకబు చేస్తున్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 25 మిలియన్ కిలోల నల్లబర్లీని కొనాల్సి ఉంది. ఇప్పుడు కొనుగోలు చేసిన పొగాకును సరైన ధర వచ్చే వరకు గోడౌన్లలో నిల్వ ఉంచాలి. భారీ వర్షాలు సంభవించినా పొగాకుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం స్థానికంగా ఉన్న అందుబాటులో ఉన్న గోడౌన్లతో పాటు, ఎక్కడైనా ప్రైవేట్ గోడౌన్లు ఉన్నాయా.? అన్న దిశగా ఎమ్మెల్యే ఏలూరి వాకబు చేస్తూ, తాను కూడా వెళ్ళి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పెదనందిపాడు కూడా వెళ్లి అక్కడి ఎమ్మెల్యే రామాంజనేయులుతో ఆదివారం చర్చించారు. పర్చూరు మండలంలోని అడుసుమల్లి, పెదనందిపాడు గ్రామాల్లో పొగాకు నిలువ ఉంచే గోదాములను ఎమ్మెల్యే ఏలూరి పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుతో కలిసి ఆదివారం పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్త గోడౌన్ల నిర్మాణం లేకపోగా.. ఉన్న గౌడౌన్ల గురించి కూడా పట్టించుకోకపోవడంతో మరమ్మతుల్లో ఉన్నాయి. మంచిగా ఉన్న గోడౌన్లలో కొన్నింటిలో ఇవిఎంలు ఉంచారు. దీంతో ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో కొంటున్న నల్లబర్లీ పొగాకు నిల్వ విషయం సవాల్‌గా మారింది.

కాగా జిల్లాలో రైతుల అవసరాల మేరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో బహుళ ప్రయోజనాల గోడౌన్ల నిర్మాణాల కోసం నాలుగేళ్ల క్రితం తొలి విడతగా 45 గోడౌన్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలను జిల్లా మార్కెటింగ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టారు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఒక్కొక్క గోడౌన్ రూ.40 లక్షల నిధులతో నిర్మించడం జరుగుతుందని చెప్పారు. అందులో ఇప్పటివరకు 25 గోడౌన్ల ▶ 2లో

'వాటా'ల వివాదం.. 'బెల్టు'కు కళ్లెం.!

- కురిచేడులో మూతపడ్డ మద్యం బెల్టుషాపులు
- పాలకవర్గ పెద్దల ఒత్తిళ్లతో.. కదిలిన ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడులో ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపారు. ఎక్కడైనా మద్యం అక్రమ విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. సాధారణ హెచ్చరికలుగా కాకుండా సీరియస్‌గానే చెప్పడంతో బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలు నిలిపేశారు. ఎక్సైజ్ అధికారులు ఇంత సీరియస్‌గా ఉండటం వెనుక నియోజకవర్గంలోని పాలక వర్గ పెద్దల ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం. పాలకవర్గ పెద్దలు మద్యం అక్రమ విక్రయాలకు సంబంధించిన వాటాల పంపకంలో అసంతృప్తుల వల్లే ఈ మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

కురిచేడు మండలంలో 15 పంచాయతీలకు 32 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలలో వందకు పైగా మద్యం బెల్టుషాపులు యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నాయి. మండలంలో అధికారికంగా మూడు మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా ఈ మూడు షాపుల యజమానులు సిండికేట్ అయ్యి మండలంలో 32 గ్రామాలకు అధిక రేట్లకు మద్యం సరఫరా చేస్తూ విక్రయాలను పెంచుకుంటున్నారు. ఇప్పటివరకు నామమాత్రంగా బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్టుషాపులు నిర్వాహకులపై కేసులు నమోదు చేసేవారు. గత రెండు రోజుల నుండి 'బెల్టుషాపులు కనిపిస్తే ఊరుకోం' అంటూ నియోజకవర్గంలోని పాలకవర్గ పెద్దల నుంచి ఆదేశాల రావడంతో ఎక్సైజ్ అధికారులు హుటాహుటిన బెల్టుషాపులకు చెక్ పెట్టారు. దీంతో మద్యం అక్రమ విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో లైసెన్స్ పొందిన బ్రాందీషాపు ▶ 2లో

'వెనుకబాటు'కు ఏదీ చేయూత?

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు, గుండ్లకమ్మ ప్రాజెక్టు వచ్చింది. ఇవి తప్ప ఇంకేమీ లేవు. వెలిగొండ ప్రాజెక్టు మూడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. దీన్ని పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. సాగునీరు, తాగునీరు అందించేందుకు భారీ లక్ష్యాలు దీనితో ముడిపడి ఉన్నాయి. నిధుల కేటాయింపుతో పాటు పనులు పూర్తి చేయాలనే సంకల్పం కనిపించడం లేదు. ఎన్నికల ప్రాజెక్టుగా మారిపోయింది.

పనులు పూర్తిచేయకుండానే గత ఎన్నికల ముందు ప్రారంభోత్సవం చేశారు. ఇంకా రూ.4 వేల కోట్లు దీనికి ఖర్చు చేయాల్సి ఉంది. జిల్లా వెనుకబాటు అధిగమించేందుకు సమగ్ర ప్రణాళికలు లేవు. అన్నీ అరకొరగానే చేపట్టారు. అప్పట్లో కరవు నివారణకు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల పేరుతో భారీగానే నిధులు కొండల్లో గుట్టల్లో పోశారు. వాటి వల్ల కలిగిన ప్రయోజనం ఏమీ లేదు. తాత్కాలిక ప్రయోజనాలే మిగిలాయి. ఇప్పటికీ కరువు కాటకాలు కొనసాగుతున్నాయి. వేసవిలో ట్యాంకర్లతోనే సాగునీటిని అందించాల్సి ఉంది. వెయ్యికి పైగా గ్రామాల్లో దాహం సమస్య ఉంది. పశ్చిమ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. వెలిగొండతోనే ఈ ప్రాంతాలకు నీటి కరువు తీరనుంది. చేపట్టిన పథకాలు కూడా పనిచేయడం లేదు. కొత్త పథకాలు వచ్చేలోపే పాత పథకాలు మూలనపడుతున్నాయి. వ్యవసాయ రంగం కూడా సంక్షోభంలోనే ఉంది.

పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పొగాకు, శనగ, పత్తి, మిర్చి ఇలా ఏటా ఏదో పంటకు ధరల్లేక రైతులు ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. ఇవన్నీ వెనుకబాటుకు చిహ్నంగా నిలుస్తాయి.

ఉపాధి పెద్ద సవాలుగా మారింది. రాష్ట్ర విభజన సమయంలో ప్రకటించిన దొనకొండ పారిశ్రామికవాడ, కనిగిరి సెజ్‌లు కలగా మిగిలాయి. అవిగో ప్రాజెక్టులు ఇవిగో ఉద్యోగాలు అంటూ కాలం గడుపుతున్నారు. తీరప్రాంతం విస్తారంగా ఉంది. ఇక్కడా హార్బర్లు, పోర్టుల పేరుతో ప్రకటనలు తప్ప ఏమీ రాలేదు. తీరప్రాంతం ఇప్పుడు టూరిజం పేరుతో సంపన్నుల చేతుల్లోకి వెళుతోంది. రిసార్ట్సులు వచ్చేస్తున్నాయి. తీరంలో జీవనశైలి మారిపోతోంది. వీటి వల్ల ఉపాధి పెరగకపోగా పాశ్చాత్య కల్చర్ తీరప్రాంతంలో పెరుగుతోంది. ఒకప్పుడు ఎకరం పొలం వందల్లో ఉంటే ఇప్పుడు రూ.కోట్లలో ఉంది. ఉప్పు సాగు, చిన్నచిన్న రైతుల రొయ్యల సాగుకు ముప్పు వస్తోంది. ఇప్పటికే కంపెనీల చేతిలోకి ఈ రంగాలు వెళుతున్నాయి. ఇక జిల్లాలో ఉన్న సహజవనరుల ఆధారంగా అభివృద్ధి జరగడం లేదు.

విస్తారంగా ఉన్న పండ్లతోటలతో పలు జ్యూస్ ఫ్యాక్టరీలకు అవకాశాలున్నాయి. ఆ దిశగా చర్యలు లేవు. ప్రణాళికలు లేవు. పండ్ల సీజన్‌లో మార్కెట్ సంక్షోభం ఎదురవుతోంది. ధరల్లేకపోవడం, నిల్వ చేసుకునే శీతల గిడ్డంగులు, ఎగుమతులకు వసతులు లేక రైతులు, చిన్న వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. సుబాబుల్, జామాయిల్ విస్తారంగా ఉంది. గతంలో రామాయపట్నం వద్ద పేపరు మిల్లుకు శంకుస్థాపన జరిగింది.అది అడ్రసు లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ కనిగిరి వద్ద రిలయన్స్ బయోఇంధన ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. దొనకొండ వద్ద సోలార్ ప్రాజెక్టు ప్రతిపాదనలో ఉంది. ఇవన్నీ కార్యరూపం దాల్చుతాయా? లేదా అనేదీ చూడాలి. ఏదేమైనా వెనుక బాటు అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

'వాటా'ల వివాదం.. 'బెల్టు'కు కళ్లెం.!

(మొదటిపేజీ తరువాయి)

యుజమానులు తమ అమ్మకాలు పడిపోతాయని ఆందోళనలో ఉన్నారు. పాలకవర్గ నేతల ఒత్తిడితో దొనకొండ మండలంలోనూ ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులు మూసేయించినట్లు సమాచారం. బెల్టుషాపులు లేకపోతే గ్రామాలు చాలా ప్రశాంతంగా ఉంటాయని మహిళలు అంటున్నారు. ఇలాగే గ్రామాల్లో మద్యం విక్రయాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు షరీఫ్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

విశ్రాంత ఉపాధ్యాయుడు షరీఫ్‌కు సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విశ్రాంత ఉపాధ్యాయుడు షరీఫ్‌ను ఆదివారం పెద్దదోర్నాలలోని బొగ్గరపువారి కల్యాణ మండపంలో యూటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పెద్దారవీడు మండలం సానికవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షరీఫ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మే నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు సన్మాన సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. తోటి ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య, ఎస్‌వికెవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ధర్మానాయక్, యూటిఎఫ్ జిల్లా నాయకులు వీరారెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు వర్ధన్, కాశీరాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

కొలుపుల్లో ఎమ్మెల్యే బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపుల కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ పాల్గొని అమ్మవారిని ద ర్శించుకొని అమ్మవారి హారతులను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకా స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల సెక్రటరీ రావులపల్లి సురేష్, క్లస్టర్ ఇంచార్జులు నువ్వుల మీరయ్య, రంపతోటి అంకారావు, యూనిట్ ఇంచార్జి బొడ్డపాటి రమణారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నిల్వకు గోడౌన్లు కరువు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 20 గోడౌన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. రెండో విడతగా 103 గోడౌన్లు జిల్లాకు మంజూరు కాగా, వీటి నిర్మాణాలకు స్థలాలను గుర్తించడం జరగాల్సి ఉందన్నారు. జిల్లాలో ఉన్న పాత గోడౌన్ల మరమ్మతులు జరిపేందుకు రూ.5 కోట్ల అంచనాలతో గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు రూపొందించారు. టెండర్లు కూడా పిలిచారు. కానీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో వీటి మరమ్మతుల పనులు జరగలేదు. గోడౌన్ల నిర్మాణాలు, మరమ్మతులు జరుపుతామన్నారు తప్ప నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడా కూడా రైతులు తమ పంటలను గోడౌన్లలో నిల్వ ఉంచుకునే అవకాశం లేకపోయింది. నల్లబర్లీ కొనుగోళ్ళకు గోడౌన్లు అందుబాటులో లేకపోవడం అనేది అతి పెద్ద సమస్య అయ్యింది. రానున్న కాలంలో అయినా రైతులు తమ పంటలను నిల్వ చేసుకునే అవసరాలకు అనుగుణంగా అన్ని గోడౌన్లకు మరమ్మతులు జరపడంతో పాటు కొత్త గోడౌన్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

గోడౌన్‌లనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

దావా సమను

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No:35/2009

Between :
కట్టా రామ కోటమ్మ (డైడ్)L.R.S.
కట్టా వెంకటకృష్ణారావు మరియు ఇతరులు..వాదులు
Vs
చింతకాయల రామకోటయ్య (డైడ్) L.R.S
చింతకాయల రత్తమ్మ వగైరాలు ... ప్రతివాదులు
To
1.పులగల నాగభూషణరావు
తండ్రి జానకయ్య **(19వ ప్రతివాది)**
2, పులగల లక్ష్మి తండ్రి జానకయ్య
(20వ ప్రతివాది)
19, 20 ప్రతివాదులు R/o ఎన్.టి.ఆర్ నగర్, అద్దంకి టౌన్, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా, అద్దంకి (డిఎంసి,)

పైనంబరు దావాను వాదులు దావా పరిహారముల నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 19 మరియు 20 ప్రతివాదులైన మీరు ఇందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచు న్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు జారీ చేయవలసినదిగా శ్రీకోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 30-06-2025వ తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారు ఎదుట స్వయముగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

అద్దంకి **ఇట్లు**
తేది : 21-06-2025 **పంచాగ్నుల రమేష్**
వాదుల తరఫు అడ్వకేట్,
అద్దంకి, బాపట్ల జిల్లా.
సెల్ నెం **9948788290**

నోటీసు

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No: 5/2022
IN
O.S. No:2/2002

Between :
మాకినేని శ్రీనివాసరావు ..... డి.హెచ్.ఆర్
మరియు
కామినేని రంగారావు వగైరాలు ...జె.డి.ఆర్ లు
To
1.కామినేని రంగారావు తండ్రి హనుమయ్య వైదనకొప్పెరపాడు గ్రామం, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా, అద్దంకి డిఎంసి. **(జె.డి.ఆర్ నెం:1)**
2. మాదాల పద్మావతి W/o శేషారావు, ప్రస్తుత నివాసం రామనగర్, అద్దంకి గ్రామం పోస్టు మండలం, అద్దంకి డిఎంసి బాపట్ల జిల్లా **(జె.డి.ఆర్.నెం:3)**
3.జాస్తి రామకోటయ్య తండ్రి నారాయణ, రిటైర్డ్ ఎంప్లాయి, అద్దంకి గ్రామం. పోస్టు మండలం అద్దంకి డిఎంసి బాపట్ల జిల్లా, **(జె.డి.ఆర్ నెంబర్4)**

పై నంబరు E.Pలో డి.హెచ్.ఆర్ తను జె.డి,ఆర్ నెంబర్ 1 నుండి పొందిన తేది 20-11-1999 తాలూకు సేల్ అగ్రిమెంట్ షరతుల ప్రకారం పైకోర్టు వారు ఇచ్చిన డిక్రీ ప్రకారం రిజిస్టర్డ్ సేల్ డీడ్ వ్రాసి ఇవ్వమని కోరుచూ మీపై దాఖలు కాబడిన పిటీషనులో మీకు ఆర్డర్ 21 రూల్ 34 సి పి సి ప్రకారం శ్రీయుత కోర్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేయవలసినదిగా కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 21-07-2025 వ తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలయును. నేను ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని ఇందుమూలకముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

అద్దంకి **ఇట్లు**
తేది : 21-06-2025 **పంచాగ్నుల రమేష్**
వాదుల తరఫు అడ్వకేట్,
అద్దంకి, బాపట్ల జిల్లా.
సెల్ నెం **9948788290**

డాక్యుమెంటు బ్యాంకు చెక్కుబుక్ పోయింది

ప్రకాశం జిల్లా చీమకుర్తికు చెందిన కోప్పోలు తిరుపతయ్య తెలియజేయునది ఏమనగా నేను తేది 03-06-2025న మర్రిచెట్లపాలెం మాఫ్యాక్టరీ నుంచి ఒంగోలుకు RTC బస్సులో వచ్చాను కర్నూల్ రోడ్డు శ్రీనివాస కాలనీ దగ్గర బస్సు దిగి చూసుకొనగా నా బ్యాగు కనిపించలేదు పోయింది. చుట్టుపక్కల వెతికినను దొరకలేదు నా దగ్గర ఉన్న బ్యాంకు చెక్కు బుక్ ఫ్యాక్టరీ సంబంధించిన పేపర్స్ ఉన్న బ్యాగు పోయినది అందులో ఫ్యాక్టరీ సంబంధించిన MDLO 108008245 నెంబర్ ట్రాన్సిక్ పేపర్స్ 3629001 నుండి 3629011 వరకు పోయినవి. దొరికిన వారు ఫోన్ నెంబర్ గాని నాచిరునామా గాని తెలియపరచ వలసిన కోరుచున్నాను

ఇట్లు
కొప్పోలు తిరుపతయ్య
శ్రీనివాస నగర్
కర్నూలు రోడ్డు, ఒంగోలు
సెల్ నెంబర్ **9391056126**

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO: 102/2022
in
O.S.NO 273/2014

మేదూరి చెన్నమ్మ .. వాది / పిటిషనర్
వర్సస్
కంపిలి చిన్నరోశయ్య వగైరాలు
.. ప్రతివాది/ రెస్పాండెంట్

టు,
6వ రెస్పాండెంట్ చిరునామా
ఎశిరెడ్డి రాజా మహేశ్వరి భర్త రమణయ్య, మల్లపాలెం గ్రామం, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా

పై నెంబర్ పిటిషన్‌లో పిటిషనర్ నీకు కోర్టు నుండి నోటీసులు పంపిన తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై పిటిషన్ నందు నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ 23-06-2025న ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

వాయిదా తేదీ: 23-06-2025
స్థలం : గిద్దలూరు **ఇట్లు**
పిడతల రాజశేఖర్ రెడ్డి,
పిటిషనర్ తరుపు అడ్వకేట్,
గిద్దలూరు.
సెల్ నెం : **9948897433**

మహారాజ శ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.No.1114/2019

UCO బ్యాంక్, ఒంగోలు బ్రాంచ్
రిప్రజంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్ ......వాది
మరియు
పులివర్తి రోజా మరొకరు ... ప్రతివాదులు
To
D1) Pulivarthi Roja
Wife of Dunna Venu, Business, R/o.Door No.3-12-1, Near Parvathamma Temple Gantapalem, Ongole town, Prakasam District.
D2) Dunna Venu
Son of Venugopala Rao, Business, R/o.Door No.3-12-1, Near Parvathamma Temple Gantapalem, Ongole town, Prakasam District.

పై కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిష్టరు పోస్టుద్వారా మరియు కోర్టుద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, కోర్టువారి వుత్తర్వుల ప్రకారం ఈపేపరు ద్వారా మీకు నోటీసులు పంపడ మైనది. కావున మీరు 02-07-2025వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లాయరుద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచటమైనది.

వాయిదా తేది : 02-07-2025
తేది : 22.06.2025
ఒంగోలు **ఇట్లు**
బొడ్డు రామలింగం
వాది తరఫున న్యాయవాది
ఒంగోలు

ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025

యువత పోరును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కొండపి

వైసీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా కూటమి నేతలు తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోనికి వచ్చి సంవత్సరం దాటిన హామీలను నెరవేర్చకుండా యువతను మోసం చేస్తుందని అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు, కూటమీ నేతలు ఇప్పటివరకు ఏ ఒక్కరికి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. యువతను మోసం చేసినందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు డిమాండ్ పత్రాన్ని అందజేస్తారని తెలిపారు. కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ పార్టీ పిఏసి సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ సారథ్యంలో కొండపి మండలంలోని నిరుద్యోగ యువత,యువత, పార్టీలోని వివిధ హోదాలలో ఉన్న ముఖ్య నేతలు, రాష్ట్రస్థాయి నాయకులు జిల్లాస్థాయి, నాయకులు మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు, భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

- ప్రమాదకరంగా బ్రిడ్జిలపై రక్షణ గోడలు
- పలుచోట్ల పూర్తిగా కూలిపోయిన వైనం
- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

త్రోవగుంట మేజర్ కాలువపై కూలిన రక్షణ గోడలు

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని పలు బ్రిడ్జిలపై ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు దెబ్బతినడంతో ప్రమాదం పొంచి వుంది. ఈ బ్రిడ్జిలపై ప్రయాణించాలంటేనే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి బ్రిడ్జిలకు ఇరువైపులా రైలింగ్ వాల్స్ పడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని చీమకుర్తి పడమర బైపాస్ జంక్షన్లో ఒంగోలు బ్రాంచ్ సాగర కాలవపై నిర్మించిన బ్రిడ్జిలకు ఇరువైపులా రెయిలింగ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా చీమకుర్తి బైపాస్ నుంచి కె.వి పాలెం వెళ్లే రూట్లో ఒంగోలు బ్రాంచ్ కాలువపై నిర్మించిన బ్రిడ్జి ఇరువైపులా రెయిలింగ్ వాల్స్ బాగా దెబ్బతిని పడిపోయాయి. ఒంగోలు కర్నూల్ రోడ్డులో రెడ్డి నగర్ సమీపంలో త్రోవగుంట మేజర్ కాలువపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా రెయిలింగ్ వాల్స్ నేలమట్టం అయ్యాయి. ఒంగోలు కర్నూలు రోడ్డులో మధుకాన్ గ్రానైట్ సమీపంలో కారుమంచి కాలువపై కూడా రైలింగ్ వాల్స్ దెబ్బతిన్నాయి. ఇలా పలు బ్రిడ్జిల ఇరువైపులా రైలింగ్ వాల్స్ దెబ్బతినడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒంగోలు-కర్నూలు రోడ్డుపై నిత్యం ద్విచక్ర వాహనాలు, భారీ గ్రానైట్ రాళ్లు తరలించే వాహనాలు తిరుగుతుంటాయి. ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు, అటు ప్రజా ప్రతినిధులు ఇటు అధికారులు ఈ రూటు గుండానే నిత్యం ప్రయాణిస్తుంటారు. అయినా పడిపోయిన రెయిలింగ్ వాల్స్ వీళ్లకు కనిపించవు. కనిపించినా పట్టించుకోరు. ఏళ్ల తరబడి కట్టిన బ్రిడ్జిలు పడిపోయే స్థితిలో కునారిల్లుతున్నా అధికారులలో చలనం లేదు. సాగర కాలువ నిర్మించేటప్పుడు కట్టిన కె.వి పాలెం బ్రిడ్జి, శిథిలావస్థకు చేరింది. దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజా సంఘాలు కోరుతున్నా పాలకుల్లో, అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలను తొలగించి వాటి స్థానంలో నూతన బ్రిడ్జిలను నిర్మించాలని, పడిపోయిన రైలింగ్ వాల్స్‌ను తిరిగి నిర్మించాలని పలువురు కోరుతున్నారు. లేకపోతే నిత్యం ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

ఇంటి పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మృతి చెందిన ఆంజనేయులు

పుల్లలచెరువు గ్రామంలోని కమ్మవారిపల్లికి చెందిన ద్రోణాదుల ఆంజనేయులు(41) ఆరవేసి ఉన్న బట్టలు తీసే క్రమంలో ఇంటిపై ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుని భార్య ద్రోణాదుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు పోలీస స్టేషన్ ఎస్ఐ సంపత్‌కుమార్ ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

గుండ్లకమ్మ కుడి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమయింది. పోలీసులు వివరాల ప్రకారం.. గుండ్లపల్లి గ్రామానికి తూర్పు వైపున నేషనల్ హైవేకి 200 మీటర్ల దూరంలో ఉన్న గుండ్లకమ్మ ఎడమ కాలువలో గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వ్యక్తి మృతదేహం లభ్యమయింది. ఒంటిమీద ఎటువంటి దుస్తులు లేవు. సుమారు వారం కిందట మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మూఢనమ్మకాల నిర్మూలనే లక్ష్యం

- జన విజ్ఞాన వేదిక జాతీయ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు
- పామూరులో ఘనంగా 18వ మహాసభలు

జెండా ఆవిష్కరించిన జెవివి నాయకులు

ప్రజాశక్తి-పామూరు

మూఢనమ్మకాల నిర్మూలనే లక్ష్యమని జన విజ్ఞాన వేదిక జాతీయ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 18వ మహాసభలు పామూరు పట్టణంలోని మయూరి ఫంక్షన్ హాల్‌లో షేక్ నాయబ్ రసూల్ అధ్యక్షతన ఆదివారం జరిగాయి. ఈ మహాసభల సందర్భంగా జాతీయ జెండాను పామూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ బాబు ఆవిష్కరించారు. మహాసభలో జన విజ్ఞాన వేదిక జాతీయ సలహాదారుడు మియా పాడిన పాటలు నాయకులు కార్యకర్తలు ఆలోచింపజేశాయి. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా జన విజ్ఞాన వేదిక జాతీయ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సైన్స్, టెక్నాలజీ అభివృద్ధి చెందుతూ ఉన్నప్పటికీ మూఢనమ్మకాలు మాత్రం తగ్గటం లేదన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా మూఢనమ్మకాలు నమ్ముతున్నారని, సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని అన్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన అన్నారు. మహాసభల్లో యోహాన్ ప్రదర్శించిన మ్యాజిక్ పిల్లలను ఎంతగానో ఆకర్షించింది. మహాసభల్లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలని, ప్రకాశం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, యూనివర్సిటీలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేసి,నిధులు మంజూరు చేయాలని తీర్మానాలు ప్రవేశపెట్టారు. 15 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లా మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవాధ్యక్షులు జేసిహెచ్ వెంకటేశ్వర్లు, శ్రీమతి సుజాత పానిగ్రహి, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజూరు భాష, స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, మానవత సేవా సంస్థ బాధ్యులు వి.వెంకటేశ్వర రెడ్డి, గోవిందయ్య, టి.వెంకటేశ్వర్లు, పి.సిద్దయ్య, కొమ్మిరెడ్డి కొండమ్మ, ధనుంజయ, మీనా, మధు, ఫణి, డా. కెటిసి పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూర్జహాన్ బేగంను పరామర్శిస్తున్న అన్నా రాంబాబు

నూర్జహాన్ బేగంకు అన్నా రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి-పొదిలి

వైసీపీ నాయకురాలు, పొదిలి పట్టణ కన్వీనర్ షేక్ నూర్జహాన్ బేగం ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కనిగిరిలో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు ఆదివారం అక్కడికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాంబాబు వెంట వైకాపా నాయకులు గొలమారి చెన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా వక్ఫ్ భూముల్లో స్థలాలు విక్రయం

కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో వక్ఫ్ బోర్డు భూముల్లో అక్రమ విక్రయాలు జోరందుకున్నాయి. బోర్డు సభ్యులే కోట్లాది రూపాయల విలువైన భూములను తక్కువ ధరకు తాకట్టు పెట్టే విధంగా అమ్మకాలు సాగిస్తున్నారనే విషయంతో పట్టణ ప్రజలు ఒక్కసారిగా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదిలి నుంచి ఒంగోలు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు భూమి ఉంది. కొందరు అక్రమార్కులు రోడ్లు ఏర్పాటు చేసి అమాయకులను ఆసరాగా చేసుకొని వారి దగ్గర డబ్బులు తీసుకొని చీటీలు రాసిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

ఆక్రమణలు తొలగించిన పంచాయతీ కమిషనర్..

వక్ఫ్ భూముల్లో అక్రమంగా రోడ్డు వేయడంపై సోషల్ మీడియా ద్వారా నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి దృష్టికి రావడంతో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి వక్ఫ్‌బోర్డు భూమిని పరిశీలించారు. అక్రమంగా వేసిన రోడ్డును జెసిబితో తొలగించారు. ఏర్పాటు చేసిన గుడిసెలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కొందరు ఆయనను అడ్డుకుని వాగ్వాదం చేశారు. వారు తమ దగ్గర ఉన్న చీటీలను కమిషనర్‌కు చూపించారు. అయితే వక్ఫ్ బోర్డు సభ్యులే రోడ్డు వేసుకొమ్మన్నారని స్థలాలు విక్రయించిన వ్యక్తి చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమాయక ప్రజలను మభ్యపెట్టి 3 సెంట్ల స్థలం కేవలం రూ.20 వేలకు విక్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి మోసాలకు ప్రజలు బలి కావద్దని సూచించారు. ప్రభుత్వ భూములను గుడ్డిగా కొనడం లేదా ఆక్రమిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ స్థలాలు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. వక్ఫ్ బోర్డు భూములను అడ్డుపెట్టుకొని జరుగుతున్న అక్రమాల గురించి వక్ఫ్‌బోర్డు చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందించి సంబంధిత అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'శ్రీరామ్' వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు వంశీకృష్ణ, శాంతకుమారి

ఒంగోలు పట్టణంలోని చివుకులవారివీధిలో వాసవీ క్లబ్ - ఒంగోలు మహిళా విజన్, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ ఉదయాస్తమ సేవలలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సానల ధీరజ్‌బాబు వైద్య సేవలందించారు. శిబిరంలో సుమారు 170 మందికి ఉచితంగా బీపీ, షుగర్, హెచ్‌బిఎ1సి, హెచ్.బి. పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఒంగోలు మహిళా విజన్ అధ్యక్షులు కారంశెట్టి వెంకటసునీత, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ పువ్వాడ నారాయణ, గార్లపాటి బ్రహ్మానందం, రీజినల్ చైర్మన్ చలువాది సత్యనారాయణ, అచ్యుతా శ్రీనివాసరావు, వాసవి క్లబ్ ఒంగోలు మహిళా విజన్ సెక్రటరీ ఆత్మకూరి శ్రావ్య, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా పాల్గొన్నారు.

పుస్తక రచయితను సత్కరిస్తున్న దృశ్యం

'వ్యాస మంజూష' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

తెలుగు సాహిత్యంలోని ప్రాచీన కవితామృతాన్ని నూతన దృక్పథంతో పరిచయం చేసే సాహితీ పరిశోధకుడు డివిఎం సత్యనారాయణ రచించిన 'వ్యాస మంజూష' పుస్తక పరిచయ సభ పుట్టంరాజు కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. సాహితీవేత్త మోటుపల్లి రామదాసు అధ్యక్షత వహించారు. సాహితీ విమర్శకుడు నారాయణం బాలసుబ్రహ్మణ్యం 'వ్యాస మంజూష' లోని ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా గాడేపల్లి దివాకరదత్తు, ఆర్‌వి రాఘవరావు, జాగర్లమూడి ప్రతాప్ వంటి సాహితీ ప్రియులు తమ లఘు పరిచయాలతో పుస్తకంలోని విశేషాలను వివరించారు. శ్రీనాథుని కనకాభిషేకం నుండి 'పాయసమెరుక' చర్చకు దాకా ఈ గ్రంథంలో శ్రీనాథుని ప్రాచీన కవిత్వాన్ని అత్యంత లోతుగా అధ్యయనం చేసిన రచయిత, శ్రీనాథ, పోతనల సాహితీ బంధాన్ని విశ్లేషించారు. శ్రీనాథుని రచనల్లో ప్రత్యక్షమైన ఆంధ్ర వంటకాల ప్రస్తావన, అల్లసాని పేడన, మొల్ల, గురజాడ, విశ్వనాథ, త్యాగయ్య, అన్నమయ్య వంటి కవులపై రచయిత చూపిన అవగాహన పాఠకులను ఆకట్టుకునేలా ఉందని అన్నారు. కన్నడక స్తూరి, మొల్ల సారస్వత ప్రభా, నౌకా చరిత్ర పద్యాల విశ్లేషణ వంటి వ్యాసాల్లో రచయిత పరిశోధనా శక్తి ప్రతిబింబించగా, లోకోక్తుల పట్ల చూపిన శ్రద్ధ చదివేవారిలో కొత్త చూపును నింపుతుంది. రామాయణంపై విస్తృతంగా రచనలు చేసిన రచయిత, వాటిని సిద్ధాంత గ్రంథంగా అభివృద్ధి చేస్తే, డాక్టరేట్ డిగ్రీకి అర్హత సులభంగా సిద్ధించగలదని పండితులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల ట్రస్టు తరఫున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ రచయితను ఘనంగా సన్మానించారు. వాచో విధేయత, నిత్య పరిశీలన, వినయ శీలత, ప్రజాకర్షణ పటిమలు ఆయనను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతిని సాధించే సాహితీ శిఖరంగా తీర్చిదిద్దగలవని వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీ కౌముది అధ్యక్షులు వారణాసి రఘురామశర్మ, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, కోశాధికారి చుండూరి మురళీసుధాకరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, గోగులమూడి శేషగిరి, ఆర్టిస్టు బాలుబీ పిసిహెచ్ కోటయ్య, కె రామమోహనరావుబీ ఎ యోగయ్య, మలాది, శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, మక్కెన వెంకటేశ్వర్లు, వినుకొండ సుధాకర్, అళహరి హరిప్రసాదు బాబు, కందికట్టి సత్యనారాయణ, పెండ్యాల అంకయ్య, కెఎస్ఆర్ కోటేశ్వరరావు, పుట్టంరాజు సాయి కుమార్‌బీ బాచిన పూర్ణచంద్రరావు, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుడు శంకర్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - పంగులూరు

జి వెంకటేశ్వర్లు (ఫైల్)

మండలంలోని అలవలపాడు గ్రామ రైతు సంఘం నాయకులు గరికపాటి శంకర్ తండ్రి వెంకటేశ్వర్లు (87) శనివారం రాత్రి మృతి చెందారు. వెంకటేశ్వర్లు గత 15 రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. అనేక చోట్ల వైద్యం చేయించినప్పటికీ ఫలితం లేదు. శనివారం రాత్రి అలవలపాడులోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. వెంకటేశ్వర్లు రైతుగా వ్యవసాయం చేయటంలో మంచి అనుభవం గడించిన వ్యక్తి. అలవలపాడు ఇరిగేషన్ చెరువుపై గతంలో సభ్యునిగా పని చేశారు. మరణించిన వెంకటేశ్వర్లుకు భార్య తిరుపతమ్మ, కుమారుడు శంకర్, కుమార్తె పద్మ ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలుపనేని రామారావు, రైతు సంఘం నాయకులు ఇంటూరి శ్రీనివాసరావు, గరికపాటి సుబ్బారావు, ప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

మద్యం బెల్టుషాపులు ఎత్తివేయాలి: సిపిఎం

ప్రజాశక్తి - పంగులూరు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కారుసాల శ్రీనివాసరావు

మండలంలోని బైటమంజులూరులో మద్యం ఏరులై పారుతోందని, అనేక కుటుంబాలు మద్యం వలన చితికి పోతున్నాయని, తక్షణమే బెల్ట్ షాపులను తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో పూసపాటి సుబ్బరాజు ఇంటి దగ్గర సిపిఎం సీనియర్ నాయకులు సరికొండ రామచంద్రరావు అధ్యక్షతన సిపిఎం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు కారుసాల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్, మండల కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడారు. గ్రామంలో మద్యం వలన అనేక కుటుంబాలు చితికి పోతున్నాయని అన్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు చిన్నభిన్నమై, పిల్లలు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్య పరిస్థితులు క్షీణించి అనేక అనర్థాలకు దారి తీసే అవకాశం ఉందని చెప్పారు. గతంలో సంపూర్ణ మద్య నిషేధం సమయంలో గ్రామంలో మహిళలంతా ఐక్యమై మద్యానికి వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. రెక్కల కష్టంపై బ్రతికే ప్రజలున్న గ్రామంలో ఐదు బెల్ట్ షాపులు నడపటం దారుణమని, దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా కదిలి మద్యం షాపులు తొలగించే వరకు పోరాడాలని సూచించారు. కౌలు వ్యవసాయం కోసం ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర రుణాలు తీసుకుంటే, అధిక వడ్డీలు వసూలు చేస్తూ మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రజలను అనేక ఇబ్బందులు పెడుతున్నాయని అన్నారు. వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ గ్రామంలో జగనన్న కాలనీలో తక్షణమే సిమెంట్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్లు లేకపోవడం వలన ఆ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సిమెంట్ రోడ్లు మంజూరు చేసి నిర్మించాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కృషి చేస్తుందని అన్నారు. పేదలందరిని ఐక్యం చేసి ఉద్యమం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తలుపనేని రామారావు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి పూసపాటి సుబ్బరాజు, లక్ష్మణ్‌రాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభం

- అందుబాటులోకి వచ్చిన క్రీడా ప్రాంగణం
- ప్రారంభించిన శాప్ చైర్మన్ రవి నాయుడు
- రూ.2కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం నిర్మాణం

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం ప్రారంభిస్తున్న శాఫ్ చైర్మన్, ఎమ్మెల్యే ఏలూరి

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని సాప్ చైర్మన్ రవి నాయుడు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. స్థానిక చీరాల రోడ్డులోని వైఆర్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రూ.2.20కోట్లతో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ఇండోర్ స్టేడియం ఈ ప్రాంత క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. తొలుత పర్చూరు ప్రాంత వాసులు, క్రీడాకారులు ఎమ్మెల్యే ఏలూరిని, సాప్ చైర్మన్ రవి నాయుడుకి ఘనంగా స్వాగతం పలికారు. ఇరువురు బ్యాట్మెంటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ 2014 – 19లో తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ఇండోర్ స్టేడియాల నిర్మాణం చేపట్టిందని చెప్పారు. అనంతరం గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం ఇండోర్ స్టేడియంను పట్టించుకున్న పాపాన పోలేదని, పాడుబడే విధంగా చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం తిరిగి అధికారానికి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్టేడియం పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారని చెప్పారు. వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేయించి క్రీడా ప్రాంగణం పెండింగ్ పనులు పూర్తి చేయించామని చెప్పారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి విడుతలవారీగా 132 క్రీడా వికాస కేంద్రాలు నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభించడంతో ఈ ప్రాంతా క్రీడాకారుల 10ఏళ్ల కల సాకారం అయిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరికి స్టేడియం నిర్వాహకులు టీ మల్లికార్జునరావు, టిడిపి అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు శంషుద్దీన్, ఎ శ్రీనివాసరావు, శాప్ మాజీ చైర్మన్ పున్నయ్య చౌదరి, డిప్యూటీ కలెక్టర్ కటారి రమేష్ నాయుడు, యు మురళీకృష్ణ, కటారి సురేంద్రబాబు, ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటం

అధ్వన్నంగా ఉన్న యనమదల ఆర్ అండ్ బి రోడ్డు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడి నుండి యనమదల గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రోడ్డు పెద్ద పెద్ద గుంటలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, మండల, జిల్లా స్థాయి అధికారులు నిత్యం ఆ రోడ్డులో ప్రమాదకరంగానే ప్రయాణం చేస్తూ ఉంటారు. అయినా ఎవరూ రోడ్డు నిర్మాణంపట్ల పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడతారో తెలియని పరిస్థితి ఉందని అంటున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఆ గుంటలకు కనీసం ఎర్రమట్టి అయిన తోలించి ఆ గుంటలు పూడ్చి ప్రయాణానికి అనుకూలంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొద్ది రోజుల క్రితం పొక్లెయినర్‌తో లోతు గుంటలు తవ్వి వెడల్పు చేశారు. అంతే తప్ప చదును చేయలేదని ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం యద్దనపూడి, యనమదల పంచాయతీ అధికారులైనా స్పందించి గుంటలను చదును చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకుడు యద్దనపూడి, పోలూరు గ్రామాల మధ్య జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. అప్పట్లో యద్దనపూడి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జివి చౌదరి స్పందించి యద్దనపూడి, పోలూరు గ్రామాల మధ్య కొంతమేర ఎర్రమట్టి తోలించి రోడ్డును సరి చేయించారు. ఆ తర్వాత ఈ రోడ్డును పట్టించుకున్న నాథుడు లేడు.

రోడ్డు మరమ్మత్తులు చేయాలి

పెరవలి శ్రీనివాసరావు

యద్దనపూడి నాయకులు పెరవలి శ్రీనివాసరావు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ గుంటల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. పరిస్థితి అర్థం చేసుకొని సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణానికి అనువుగా చేయాలని కోరారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తరచు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బైకుపై వెళ్లాలంటే నరకమే

నల్లపనేని సురేష్

యద్దనపూడి గ్రామానికి చెందిన రైతు నల్లపనేని సురేష్ మాట్లాడుతూ తమ గ్రామం నుండి సమీప పట్టణమైన చిలకలూరిపేటకు ఈ రోడ్డు గుండానే వెళ్ళవలసిన పరిస్థితి ఉందని, ఈ గుంటల్లో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుంటే నడుం, భుజం, మెడ నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకొని రోడ్డు నిర్మించాలని కోరారు.

గడ్డం శాంతయ్య, వాహన చోదకుడు

గడ్డం శాంతయ్య

పోలూరుకు చెందిన వాహన చోదకుడు గడ్డం శాంతయ్య మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రయాణించా లంటే ప్రమాద భరితంగా ఉందని అన్నారు. పోలూరు అడ్డ రోడ్డు నుండి పెద్ద జాగర్లమూడి గ్రామాల మధ్య రోడ్డు పెద్ద గుంతలతో ఉందని తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుందని తెలిపారు. ఏదైన ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయాలి

ఐద్వా పిలుపు

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జులై 9న పట్టణ, కేంద్రాల్లో జరిగే కార్మిక కర్షక ప్రదర్శనలో మహిళలు సమ్మెకు సంఘీభావంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఐద్వా పిలుపునిచ్చింది. ఆదివారం నాడు ఒంగోలు ఎల్బీజీ భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు జి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశ తీర్మానాలను ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మీడియాకు వెల్లడించారు. సమావేశంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జీవి కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు నిరసనగా, నాలుగు లేబర్ రోడ్డులను రద్దుచేసి కార్మిక చట్టాలను కొనసాగించాలని కోరుతూ జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి కార్మిక, కర్షక వర్గాలతో కలిసి మహిళలు ముందుకు రావాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు సౌకర్యం హామీని అమలు పరచకపోవడం అన్యాయమన్నారు. మహిళల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విచ్చలవిడిగా నడుస్తున్న లిక్కర్ బెల్ట్ షాపులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో దోషులను పట్టుకోవడంలో జరుగుతున్న నిర్లక్ష్యం విడనాడాలని హితవు పలికారు. నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం ప్రారంభ సూచికంగా ఐద్వా జెండాను సీనియర్ నేత ఏ రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. సమావేశంలో ఐద్వా నాయకులు ఎన్.మాలతి, ఎస్ కే నాగూర్, కే రాజేశ్వరి, బి రాజ్యలక్ష్మి, వై అంజనీదేవి, పి.లక్ష్మి, జి.కళ్యాణి, కె.విజయలక్ష్మి, కే.రత్తమ్మ, యం.వెంకటమ్మ, పి. ప్రేమలత, ఎస్ ఇంద్రజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు పోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

మత్స్యకారులతో మాట్లాడుతున్న గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల మండలం వాడరేవు, విజయ లక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ వద్ద ఉన్న సీమౌత్‌ను చదును చేసి ఆక్రమణలకు పాల్పడిన బుర్ల వెంక ట్రావు అనే రియల్ ఎస్టేట్‌దారునికి అధికారులు, ప్రజాప్రతినిధులు అం డగా ఉండటం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పేర్కొన్నారు. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ సముద్ర ముఖ ద్వారం వద్ద ఆక్రమణ గురైన స్థలాన్ని మత్స్యకార కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, చేతి వృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.కొండయ్య ఆదివారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న మత్స్యకారులతో మాట్లాడారు. స్ట్రయిట్ కట్ కాలువ వద్ద సహజసిద్ధంగా ఏర్పడిన సీమౌత్ ను చదును చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చీరాల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సముద్రంలో కలిసే విధంగా స్ట్రయిట్ కట్‌ను గతంలో నిర్మించగా, ఆ కాలువ సముద్రంలో కలిసే చోట తూర్పు వైపు భూములు కలిగి ఉన్న వెంకట్రావు అనే వ్యక్తి అక్కడ ఉన్న సీమౌత్‌ను చదును చేయడం, తనకు చెందిన పట్టా భూమి సముద్రం ఒడ్డు వరకు ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వభూమికి రెవెన్యూ అధికారులు దొంగపట్టాలు ఇచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వాడరేవు, విజయలక్ష్మీపురం తదితర గ్రామాల మత్స్యకారులు తుపానులు, బోట్ల మరమ్మత్తులు, వేట నిషేధ కాలాల్లో తమ బోట్లను ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ లో ఉంచుకుని వేట సమయంలో సముద్రంలోకి తెచ్చుకోవడం జరుగుతుందని, అక్కడ ఉన్న సీమౌత్‌ను మూసివేయడం వల్ల రానున్న కాలంలో బోట్లకు రక్షణ ఉండదన్నారు. ఇక్కడి భూమి విషయమై అధికారులు సమగ్ర విచారణ జరిపి మత్స్యకారుల బోట్లకు రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. ఈ విషయమై మత్స్యకారులు జరిపే పోరాటానికి సిపిఎం, మత్స్యకార కార్మిక సంఘం అండగా ఉంటాయని చెప్పారు. సీమౌత్ మూసివేసి, తీరంలోని ఇసుక దిబ్బలను చదును చేసిన బుర్ల వెంకట్రావుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సీమౌత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల తనిఖీల

మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యాశాఖ పాఠశాలల తనిఖీలపై మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరుపై విధి విధానాలు విద్యాశాఖ కమిషనరేట్ విధివిధానాలు రూపొందించింది. ఈ విధివిధానాలు తక్షణం అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశించింది. తాజాగా రూపొందించిన మార్గదర్శకాలలో విద్యాశాఖలో అధికారాలన్నీ కేంద్రీకతం చేస్తున్నట్లుగా సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాస్థాయిలో పాఠశాలల తనిఖీలు డిఇఒలు నేరుగా, డిప్యూటీ డిఇఒలు కూడా కొన్ని సందర్భాల్లో నేరుగా తనిఖీ చేసే పరిస్థితి ఉండేది. ఇక నుండి అలా కుదరదు. డిఇఒ, డిప్యూటీ డిఇఒలు ఏ పాఠశాలకు వెళ్లాలి అనేది కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (సిఎస్ఇ) నుంచి మెసేజ్ వస్తుంది. ఇకపై కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మెసేజ్‌కి అనుగుణంగా డిఇఒ, డిప్యూటీ డిఇఒలు నిర్దేశించిన పాఠశాలల్లో తనిఖీలు చేపట్టవలసి ఉంటుంది.

రోజూ ఉపాధ్యాయుల అటెండెన్స్ రివ్యూ..

జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయుల హాజరు ప్రతి రోజూ విద్యాశాఖ కమిషనర్ ఉదయం 9.30 గంటలకు క్రమం తప్పకుండా పరిశీలిస్తారు. ఈ లోపు హాజరు వేయకపోతే ఆబ్సెంట్‌గా పరిగణిస్తారు. సెలవు కావలసిన వారు ఉదయం ఏడు గంటల లోపు అప్లై చేసుకోవాలి. ప్రతిరోజూ స్టూడెంట్ అటెండెన్స్, టీచర్ అటెండెన్స్ తప్పనిసరిగా ఉదయం 9 గంటల లోపు నమోదు చెయ్యాలి. ఎంఇఒ అనుమతి లేకుండా ఎవ్వరు కూడా డిడిఒ రిక్వెస్ట్, డిప్యూటేషన్ మరేదైనా అప్లై చెయ్యడానికి లేదు. ప్రతి రోజూ 9-30 గంటలకు కమిషనర్ రివ్యూ చేస్తారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది నుండి మండల విద్యాశాఖ సిబ్బంది వరకు హాజరు నమోదుపై రివ్యూ ఉంటుంది. కమిషనర్ పర్యవేక్షణ సమయంలో లేదా నవారి సిబ్బంది పర్యవేక్షణ సమయంలో ఏ పాఠశాలలో అయి నా, స్కూల్ లొకేషన్‌లో సిగ్నల్ ఉండి.. ఆ ప్రదేశంలో ఉపాధ్యా యులు హాజరు వేయకుంటే వారిపై చర్యలు తీసుకుంటారు. ఏ పాఠ శాలలో అయిన సిగ్నల్ సమస్య ఉంటే ఎంఇఒ ద్వారా లెటర్ రూపం లో తెలియజేసినట్లయితే లొకేషన్ అన్‌ఫ్రీజ్ చేస్తారు. తదుపరి లొకే షన్ కాప్చర్ చేయటానికి అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాలలో టైం టేబుల్ వారీగా ఉపాధ్యాయులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. కమిషనర్ లేదా ఆ కార్యాలయ అధికారులు త్వరలో ప్రతి జిల్లా, ప్రతి మండలంలోని పాఠశాలలను సందర్శిస్తారు.

కావూరి దంపతులకు మాగుంట శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు దంపతులకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో మాజీ కేంద్ర మంత్రి, ప్రముఖ వ్యాపారవేత్త కావూరి సాంబశివరావు 60వ వివాహ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న మాగుంట పాల్గొని.. సాంబశివరావు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'వందనం'కు బంధనాలు

- అంగన్‌వాడీల పిల్లలకు అందని 'తల్లికి వందనం' పథకం
- కూటమి సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తి
- సమస్యల పరిష్కారం కోసం నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంగన్‌వాడీలపై సర్కారు చిన్నచూపు చూస్తోంది. చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న అంగన్‌వాడీల కార్యకర్తలు, ఆయాల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఆంక్షలు విధించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వం అరకొర జీతంతో గడుపుతున్న అంగన్‌వాడీల పిల్లలకు మంజూరు చేయలేదు. తల్లికి వందనం పథకాన్ని తమకు కూడా వర్తింపజేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా పిల్లలు, గర్భిణులు, తల్లులు ఫొటోలతో కూడిన వివరాలను పోషణ్ ట్రాకర్, బాలసంజీవిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఒత్తిడికి గురవుతున్నారు. ఎంతో నిబద్ధతతో సేవలు అందిస్తున్నా.. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విసిగిపోతున్నారు. తాజాగా వీరికి తల్లికి వందనం పేరిట విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమయ్యే నగదు వేయకుండా కోత విధించారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు..

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారు. అంగన్‌వాడీలను సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందువలన ఏ సంక్షేమ పథకాలూ అమలు కావడం లేదు. అంగన్‌వాడీ ఆయమ్మకు, మినీ వర్కర్లకు రూ.7 వేలు, వర్కర్లకు రూ.11,500 చెల్లిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం సరికాదు. దీని వల్ల అంగన్‌వాడీ కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం, విద్యాదీవెన, ఇంట్లోని వృద్ధులకు వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్ ఇవ్వడంలేదు. 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదు. 42 రోజుల సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని రాత పూర్వకమైన హామీని కూటమి ప్రభుత్వం ఇచ్చినా.. నేటికీ అమలు చేయలేదు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా మార్చామని అసెంబ్లీ సాక్షిగా ఐసిడిఎస్ మంత్రి ప్రకటించినా నేటికి జీఓ విడుదల కాలేదు.

అంగన్‌వాడీ సేవలు ఇలా..

చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో 2903 మెయిన్, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు 2,596 మంది, ఆయాలు 2,548 మంది, మినీ కార్యకర్తలు 227 మంది విధులు నిర్వహిస్తున్నారు.

నిత్యావసర సరుకులకు ఇబ్బంది..

అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన నిత్యావసర సరుకులు అన్నీ గతంలో నేరుగా కేంద్రాలకు వచ్చేవి. గత నెల నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ షాపుల నుంచి సరుకులు తెచ్చుకోవడానికి రవాణా ఛార్జీలు భరించాల్సిందేనని ఇబ్బంది పెడుతున్నారు. అంగన్‌వాడీల కేంద్రాలు నిర్వహించాలంటే భారంగా మారిందని పలువురు అంగన్‌వాడీలు అంటున్నారు. అంగన్‌వాడీల కేంద్రాలు నిర్వహణ నిధులు సకాలంలో పడకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు లేని చోట అద్దె భవనాలకు ప్రభుత్వం మంజూరు చేసిన అద్దె చాలక కార్యకర్తలు సొంత నిధులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, సంక్షేమ పథకాలు అమలు, ఎఫ్ఆర్ఎస్ రద్దు, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలి. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేసేందుకు అంగన్‌వాడీలు సిద్ధమయ్యారు.

సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి

వై సత్యవతి, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి. అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచామన్న పేరుతో ప్రభుత్వం సంక్షేమ పథకాలలో కోత విధించడం దారుణం. తల్లికి వందనంతో పాటు మిగతా సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు వర్తింపజేయాలి.

సమస్యలు పరిష్కరించాలి

ఈదర అన్నపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి. ఆయాలు, కార్యకర్తలు పిల్లలకు తల్లికి వందనం వర్తింపచేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే రేషన్ నేరుగా కేంద్రాలకు సరఫరా చేయాలి. వేతనాలు పెంచాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి. ట్యాబ్‌లు ఇవ్వాలి.

తల్లికి వందనం వర్తింపజేయాలి

డికెఎం రఫీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం చెప్పిన ప్రకారం రూ.12 వేల ఆదాయం లోపు ఉన్న వారంతా సంక్షేమ పథకాలకు అర్హులే. అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు, మినీ వర్కర్లకు రూ.7 వేలు గౌరవ వేతనం ఇస్తున్నందున అంగన్‌వాడీలు అందరికీ అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- సైకిల్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య
- బహుమతి ప్రధానోత్సవంకు హాజరైన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ

జెండా ఊపి సైకిల్ రేస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. తనతోపాటు తన తనయుడు గౌరీ అమర్నాథ్ పుట్టిన రోజు సందర్భంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వాడరేవు నుండి ప్రారంభమైన సైకిల్ పోటీలను ఎమ్మెల్యే కొండయ్య పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైక్లింగ్ కాంపిటీషన్ 60కిలోమీటర్లు, 20కిలోమీటర్లు నిర్వహించారు. పోటీలకు పంజాబ్, కేరళ, చత్తీస్గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుండి యువత హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి యువనేత మద్దులూరి గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ 60కిలోమీటర్లకు సంబంధించిన సైకిల్ ఛాంపియన్‌షిప్ కాంపిటేషన్ ప్రథమ స్థానం సాధించిన విజేతలకు రూ.1లక్ష నుండి 7వ స్థానం సాధించిన వారికి రూ.5వేలతో ముగుస్తుందని తెలిపారు. 20కిలోమీటర్ల ఇండియన్ మేడ్ సైకిల్ ఛాంపియన్‌షిప్ కాంపిటీషన్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సైకిల్ ఛాంపియన్‌షిప్ కాంపిటేషన్‌కు అధిక సంఖ్యలో హాజరైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. 60కిలోమీటర్ల ఛాంపియన్‌షిప్ విజేతలుగా కర్ణాటకకు చెందిన సిద్దార్థలింగ్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.1లక్ష గెలుపొందారు. ఢిల్లీకి చెందిన అర్షద్ ఫరీద్ ద్వితీయ స్థానం సాధించి రూ.50వేలు, కర్ణాటకకు చెందిన నవీన్ తృతీయ స్థానంలో సాధించి రూ.30వేలు, మహారాష్ట్రకు చెందిన సంజయ్ పటేల్ 4వ స్థానం రూ.20వేలు, కేరళకు చెందిన సుదేవ్ ఎంటి 5వ స్థానం రూ.10వేలు, కర్ణాటకకు చెందిన బాసు ఎంటి 6వ స్థానం రూ.10 వేలు, కర్ణాటకకు చెందిన వరుణ్ 7వ స్థానంలో నిలిచి రూ.5వేలు గెలుపొందరు. 20కిలోమీటర్ల విజేతలుగా తమిళనాడుకు చెందిన ఎస్ అబ్రహం ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలు, తమిళనాడుకు చెందిన రాజా పాండి ద్వితీయ స్థానం రూ.30 వేలు, మహారాష్ట్రకు చెందిన సోహెల్ రియాజ్ తృతీయ స్థానంలో నిలిచి రూ.20వేలు గెలుపొందారు. విజేతలకు చీరాల, బాపట్ల శాసన సభ్యులు కొండయ్య, వేగేసేన నరేంద్రవర్మ, తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో బహుమతులు అందజేశారు. 60 కిలోమీటర్ల రేస్‌లో పాల్గొన్న రాజమండ్రికి చెందిన వేణుగోపాల్, 20కిలోమీటర్లు కంప్లీట్ చేసిన పాకాల పాండు గతంలో శబరిమల సైకిల్ యాత్ర 10 సార్లు పూర్తి చేశారని హర్షం వ్యక్తం చేస్తూ రూ.10వేలు కన్సోలేషన్ బహుమతి అందజేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సైకిల్ ఛాంపియన్‌షిప్‌లో విజయవంతం కావడానికి కారకులైన పోలీసు, వైద్య సిబ్బంది, ఆర్గనైజింగ్ టీం, గ్రిఫిన్ బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బహుమతులు అందచేస్తున్న ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ

పిల్లలను బడిలో చేర్చేందుకు కార్యాచరణ : యుటిఎఫ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను బడిలో చేర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పిల్లలను బడిలో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అల్తాఫ్ హుస్సేన్, వి సురేష్ కుమార్ సూచించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు కేటాయించిన శిక్షణ తరగతులు వాయిదా పడిన దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకొని నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల పట్ల విద్యార్థుల తల్లి, దండ్రులకు నమ్మకాన్ని కలిగించే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రస్తుతం సాంకేతిక రంగం అభివృద్ధి చెంది విద్యార్థులు వివిధ అంశాలపై పెడద్రోవ పడుతున్న దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యత ప్రమాణాలు, విలువలతో కూడిన విద్య బోధించి విద్యార్థులను సన్మార్గంలో నడిపించే విధంగా పనిచేయాలని అన్నారు. సమాజానికి దోహదపడే విధంగా ఉత్తమ పౌరులుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందన్నారు. రోజువారి కూలి పనులకు వెళ్లే అనేక మంది వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తూ ఉంటారని, అలాంటి పిల్లలకు ఉపాధ్యాయులు ప్రేమ పూర్వకంగా విద్యాబుద్ధులు నేర్పించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాల ప్రారంభ దశ నుండే విద్యలో వెనుకబడిన విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని కల్పించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో వచ్చే సమస్యలపై పోరాడుతూనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చిత్తశుద్ధిని చూపాలని పేర్కొన్నారు. యుటిఎఫ్ శ్రేణులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

'ఉపాధి' మస్టర్లలో లోపాలు

ప్రజాశక్తి - పంగులూరు

పేదలకు పనులు లేని రోజుల్లో పని కల్పించి ఉపాధి చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారి పనులకు వెళ్లే ఉపాధి కూలీలు హాజరు నమోదు విషయంలో అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తాము ఆరు రోజులు పనిచేస్తే రెండు రోజులు మాత్రమే మస్టర్‌తో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడులో ఉపాధి కూలీ జాబ్ కార్డు నెంబర్ 10514 కలిగి ఉన్న శృంగవరపు బ్రహ్మయ్య ఏప్రిల్ నెలలో వారంలో ఆరు రోజులు పనికి వెళితే రెండు రోజులు మాత్రమే హాజరు వేశారని ఆరోపిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జాబ్ కార్డు నెంబరు 10669 కలిగివున్న శృంగవరపు కృష్ణ ఏప్రిల్ నెలలో వారంలో ఆరు రోజులు ఉపాధి కూలి పనికి వెళితే రెండు రోజులు మాత్రమే హాజరు వేసినట్లు ఆరోపిస్తున్నారు. మాస్టర్లో కూలీల పనియాయం జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగటం లేదని తెలిపారు. పని ప్రదేశంలో ఒక గ్రూపు రోజువారి కూలీలకు సంబంధించి పని ప్రదేశంలో హాజరు కోసం తీసిన ఫోటోలను వేరే దినసరి కూలీల పేర్లకు అనుసంధానం చేసి హాజరు చూపిస్తున్నారని చెబుతున్నారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, పనికి వెళ్లే ఉపాధి కూలీలకు హాజరు విషయంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వేతన జీవులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని యనమదల పంచాయతీ పరిధిలోని కోళ్ల ఫారాల వద్ద పనిచేస్తున్న బీహార్‌కు చెందిన మహిళ ఆదివారం ఎలుకల మందు తిని ఆత్మహత్య ప్రయత్నంకు పాల్పడింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఇంఎటి కె రవికుమార్ ప్రథమ చికిత్స అందించి అనంతరం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు ... మస్తన్ వలి ఉన్నారు.

గ్రామాల్లో 'శంకర్ దాదాలు'

- ఆర్‌ఎంపి పేరుతో వచ్చీరాని వైద్యం
- కన్నెత్తి చూడని వైద్యాధికారులు
- రోగాలతో అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజలకు నాణ్యమైన వైద్యం కావాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యం కోసం వెళ్లే సర్కారు వైద్యశాలల్లో వైద్యానికి అవసరమైన పరీక్షలు నిర్వహించేందుకు సరైన వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి డబ్బులు వదిలించుకోవాల్సి వస్తుంది. కార్పొరేట్ వైద్యశాలకు వెళ్లాలంటే అంతస్థాయి, ఆర్థిక స్థోమత లేక గ్రామీణ ప్రజలు ఆర్‌ఎంపీల వద్దకే వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపి వైద్యులని చెప్పుకుంటూ శంకర్ దాదాలను తలపిస్తున్నారు. కొందరు వచ్చీ, రాని వైద్యం చేస్తు రోగుల జబ్బును ముదరబెడుతున్నారు. ఎటువంటి నైపుణ్యం, అనుభవం లేకుండానే వైద్యం చేస్తున్నారు. కొద్దికాలం అనుభవం ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాంపౌండర్లుగా పనిచేసి ఇంజక్షన్లు, సెలైన్లు పెట్టడం నేర్చుకున్నాక వీరే గ్రామాల్లో ఒక క్లినిక్ ఏర్పాటు చేసుకొని ప్రజలకు వైద్యం చేస్తున్నారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. అసలు ఆర్‌ఎంపి వ్యవస్థ ఉందా అనేది ప్రశ్నగానే ఉంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆర్‌ఎంపిలు ప్రథమ చికిత్స చేసేందుకు కొంత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చేవారు. దాని కాల పరిమితి పూర్తయ్యాక రెన్యువల్ చేయించుకోవాలి. దీంతోపాటు వారికి రిఫ్రెషర్ తరగతులు నిర్వహిస్తారు. ప్రస్తుతం వాటి దాఖలాలు కనిపించడం లేదు. అలాంటి వారు నూటికి 20మంది కూడా లేరు. దీనిపై సంబంధిత శాఖ పర్యవేక్షణ లేదు.

పుట్టగొడుగుల్లా ప్రథమ చికిత్స కేంద్రాలు

గ్రామాలు, పట్టణ పేదల నివాస ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తెలిసీ, తెలియని వైద్యంతో వీరి వద్దకు వచ్చే రోగులకు అధిక మోతాదులో ఔషధాలు, ఇంజక్షన్లు, టాబ్లెట్లు ఇస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రయోగాలు చేస్తున్నారు. దీంతో రోగికి తక్షణ ఉపశమనం కరగడంతో వీరిపై నమ్మకం పెరుగుతుంది. ఏ వ్యాధి సోకిన దానిని ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తి ప్రతి మనిషిలోనూ ఉంటుందని, కొంత కాలపరిమితిలో ఎక్కువ జబ్బులను శరీరంలో ఉన్న వ్యాధి నిరోధక శక్తి నయం చేసే సందర్భాలు ఎక్కువగా ఉంటాయని అనుభవం ఉన్న వైద్యులు చెబుతున్నారు. రోగ తీవ్రతను బట్టి రోగికి తగు మోతాదులో ఇంజక్షన్లు, మాత్రలు ఇస్తారు. అయితే ఇష్టానుసారం హైపర్ మందులు వాడడంతో దీర్ఘకాల వ్యాధులకు గురి అయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మండలంలో ఈ తరహా క్లినిక్కులు 100కుపైగా ఉంటాయని తెలుస్తోంది.

మెడికల్ షాపుల వద్ద చికిత్స

మెడికల్ షాప్ లైసెన్స్ తీసుకొని ప్రభుత్వ నిబంధనలకు మేరకే మందుల స్టాక్ పెట్టి డాక్టర్ల చీటీల ద్వారా ఔషధాలు విక్రయించాలి. అయితే మచ్చుకైన అవి కనిపించవు. మెడికల్ షాప్ నిర్వాహకులు ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తారు. వైద్యశాలలకు ఎందుకు మేమున్నామంటూ వైద్యం చేస్తుంటారు. దీనిపై వైద్యాధికారుల పర్యవేక్షణ లేదు. హోల్సేల్ దుకాణాలు ఏర్పాటు చేస్తూ లెక్కకు మించి మత్తు టాబ్లెట్లు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు వీటి మత్తుకు బానిసైన యువకులకు విక్రయిస్తున్నారు. దీనిపై సంబంధిత పోలీస్ అధికారులు ఇటీవల స్టువర్టుపురం ప్రాంతంలో దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో టాబ్లెట్ స్వాధీనం చేసుకున్నారు. కొన్ని ప్రథమ చికిత్స క్లినిక్‌లలో దెబ్బలకు కట్లు కట్టడం, డ్రెస్సింగ్ చేయడం చేస్తుంటారు. కొందరు ఒక అడుగు ముందుకు వేసి చిన్న, చిన్న ఆపరేషన్లు చేస్తున్నారు. గర్భస్రావాలకు మందులు ఇవ్వడం, అక్రమంగా సెలైన్ల ద్వారా హైపవర్ ఇంజక్షన్లు చేయడం వంటి స్థాయికి మించిన వైద్యం చేస్తున్నారు. ప్రజలు ఆర్థిక కారణాల దృష్ట్యా వీరిని ఆశ్రయిస్తున్నారు. డాక్టర్ కోటు వేసుకోవడం, స్టెతస్కోప్ ధరించడం, పెద్ద కుర్చీ, టేబుల్ ఏర్పాటు చేసి దానిపై బిపి మిషన్, క్లినికల్ థర్మామీటర్, మందులకు సంబంధించిన పేపర్ వెయిట్లు పెట్టి శంకర్ దాదాల్లా బిల్డప్ ఇస్తున్నారు. అదే క్లినిక్ గోడలపై అంబులెన్స్ సప్లై చేసే వివరాలు, కార్పొరేట్ ఆసుపత్రుల పోస్టర్లు, డయాగ్నస్టిక్ సెంటర్ల వివరాలు, బ్లడ్ బ్యాంక్ అడ్రస్సులు సంబంధించిన చిత్రాలు ఏర్పాటు చేస్తారు. వారందరితో వీరు ఒప్పందం కుదుర్చుకుని రోగుల ఆరోగ్య అవసరాలను బట్టి అక్కడకు పంపి వీళ్ళ పర్సంటేజ్ వీళ్ళు తీసుకుంటారు. రోగికి అవసరం ఉన్నా, లేకపోయినా మీరు సిఫార్సు చేసి కమిషన్లు దండుకుంటారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య, ఔషధ నియంత్రణ మండలి, ఆయుష్ అధికారులు పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా పావులూరు-నాగండ్ల రహదారి

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు నుంచి పావులూరు మీదుగా నాగండ్ల పోయే రహదారి అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు మరమ్మత్తులు చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. టిప్పర్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు ఈ రోడ్డులో నిత్యం ప్రయాణిస్తూ ఉంటాయి. వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి స్వగ్రామమైన పావులూరు వరకు రహదారి బాగానే ఉన్నా అక్కడి నుంచి చిన నక్కలపాలెం, పెదనక్కలపాలెం, నాగండ్ల, సూదివారిపాలెం మలుపు వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు మీదుగా కోళ్లపూడి నుంచి జాతీయ రహదారికి పోవటానికి అతి దగ్గర మార్గం. నాగండ్ల నుంచి ద్రోణాదుల మీదుగా బొబ్బేపల్లి, యద్దనపూడి, చిలకలూరిపేట, ద్రోణాల, రాజుగారిపాలెం, ద్రోణాల నుండి జొంతాలి మీదుగా మార్టూరు పోవడానికి మార్గాలు ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రధానంగా నర్సివారిపాలెం, దాంకూరు, ధర్మవరం, బొబ్బేపల్లి, ద్రోణాదల, తాటివారిపాలెం, బొల్లాపల్లి తదితర గ్రామాల నుండి ఎర్ర గ్రావెల్‌తో పాటు కసర్ల, చిప్స్ ముక్కలు, డస్ట్ నిత్యం టిప్పర్లతో సరఫరా చేస్తుంటారు. అవి నాగండ్ల రోడ్డు నుంచి ఇంకొల్లుకు చేరి కడవకుదురు వరకు, చిన్నగంజాం, నాగులుప్పలపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు అవసరమైన మెటల్, ఎర్రమట్టి సరఫరా చేస్తూంటాయి. ట్రాక్టర్లలో పొలాలు, స్థలాలు, ప్లాట్లు, కంచెకు అవసరమైన కొండరాళ్లు మార్టూరు, బల్లికురవ నుంచి గృహాల గోడల నిర్మాణానికి అవసరమైన కొండరాళ్ళు, గ్రానైట్ సరఫరా చేస్తుంటారు. చిన్నగంజాం, కడవకుదురు, పందిళ్ళపల్లి తదితర గ్రామాల నుంచి ఇసుక కూడా ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇంకొల్లు, నాగండ్ల మీదుగా కోళ్లపూడి, ద్రోణాదల, బొబ్బేపల్లి, మార్టూరు తదితర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయమని ఆ ప్రాంతాల్లో వాహనాలు నడిపే వాహన చోదకులు అంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు సైతం గుంటల్లో పడి పాడైపోతున్నట్లు డ్రైవర్లు తెలిపారు. ఈ రోడ్డు ఆర్ అండ్ బి పరిధిలో లేకుండా జడ్పీ పరిధిలో ఉన్నందునే పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఈ రోడ్డు బాగా లేకపోవడం వల్లనే సైనిక్ స్కూల్ ప్రారంభానికి వస్తున్న మంత్రి లోకేష్ ర్యాలీని మార్టూరు నుంచి ముప్పవరం, పంగులూరు, ఆరికట్లవారిపాలెం, గంగవరం మీదుగా దగ్గుబాటి సంస్థలకు వచ్చే విధంగా ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేయాలని, ఆయా గ్రామాలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపర్చాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఐలవరంలో శరవేగంగా అభివృద్ధి పనులు

ఐలవరంలో జరుగుతున్న డ్రైనేజీ కల్వర్టు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలో ఎన్నో ఏళ్లుగా మురుగు నీరు బయటకి పారుదలయ్యే మార్గం లేక అధిక వర్షాల సమయంలో వర్షపు నీటికి చెరువులు, పంట పొలాలు, గృహాలను సైతం ముంచేత్తుతున్నాయి. ఈ దృష్ట్యా ఎట్టకేలకు సిసి డ్రైన్ నిర్మాణానికి అధికారులు శ్రీకారంచుట్టారు. మురుగునీటి వలన జరుగుతున్న నష్టం, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎంపిపి డివి లలిత కుమారి, ఎంపిటిసి ఎం శ్రీనివాసరావు సహకారంతో సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్తులు కోరిన ప్రాంతంలో మురుగు కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కలసి ఆ ప్రాంతాన్ని కొలతలు తీసి మూడు దశలుగా అంచనాలు రూపొందించారు. గ్రామంలో పంచుమర్తి శంకర్రావు ఇంటి నుండి దళితవాడ చర్చి వరకు రూ.13 లక్షలకుపైగా సిసి డ్రైవ్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు. ఈ అంచనాలను మండల పరిషత్ కార్యాలయంలో దాఖలు చేయగా ఎంపీటీసీ నిధుల నుండి తోలివిడతగా రూ.6.30 లక్షల నిధులు రెండు అంచనాలుగా మంజూరు చేశారు. ఈ మంజూరు అనుసరించి ఎంపీటీసీ ఆధ్వర్యంలో మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేర్చాయి. గ్రామంలో అత్యంత ప్రధాన సమస్యగా మారిన మురుగు కాలువ నిర్మాణంతో గ్రామంలోనే కాక దళితవాడ ప్రజలకు మురుగు సమస్య తీరనుంది. మురుగు కాలవ నిర్మాణ పనులు దళితవాడ చర్చి వరకు నిధులు మంజూరు చేసి పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపిటిసి శ్రీనివాసరావు తెలిపారు.

దోమలు దుర్వాసనకు చరమగీతం

డ్రైనేజీ లేక ఈ ప్రాంతంలో నిత్యం మురుగునీరు నిలబడి దోమలు, దుర్వాసనతో నానా అవస్తలు పడేవారని, ప్రస్తుతం ఆ సమస్య నుండి విముక్తి కలిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒక సీజన్ అని లేకుండా వేసవి కాలంలో సైతం మూడు అడుగుల లోతు మురుగు నీరు నిలబడి, చెత్తా చెదారం పేరుకుపోయి బయటికి వెళ్లే మార్గం లేక దుర్వాసన వెదజల్లుతూ ఉండేదని చెబుతున్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధుల చర్యలతో మురుగు కాలువ నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్తులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. తొలి దశగా విడుదల చేసిన నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తికానున్న దృష్ట్యా 2వ విడతగా మరి కొంత నిధులు మంజూరు చేసి పనులకు ఆటంకం లేకుండా ముందుకు సాగే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాన సమస్యగా ఉన్న ఈ మురుగు నీటి కాలువ నిర్మాణానికి పాలకవర్గ సభ్యులతో చర్చించి నిధులు మంజూరు చేసి పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంక్రీట్ గోడలు నిర్మించక ముందు మురుగు కాలువ

మురుగు నీటిలో నిర్మించిన కాలువ గోడలు

పల్లపోలు సాంబయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఘనంగా సాంబయ్య జయంతి

ప్రజాశక్తి - వేటపాలెం

సోషలిస్ట్ పార్టి ఎపి ప్రెసిడెంట్, వేటపాలెం మాజీ సర్పంచ్ పల్లపోలు సాంబయ్య 99వ జయంతి సందర్భంగా విశ్రాంత ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి స్థానిక సాంబయ్య విగ్రహానికి పూలమాల వేసి ఆదివారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లపోలు సాంబయ్య పేద ప్రజల నాయకుడని, జీవితాంతం డాక్టర్ రాం మనోహర్ లోహియా అనుచరు డిగా పనిచేసారని అన్నారు. బాపట్ల పార్లమెంటుకు పోటీ చేసి ద్వితీయ స్థానం పొందారని అన్నారు. విశ్రాంత మిలటరీ మ్యాన్ నరాలశెట్టి కృష్ణ మాట్లాడుతూ నల్లమడ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా కమ్యునిస్టు నాయకులు కొల్లా వెంకయ్యతో కలిసి పని చేశారని చెప్పారు. సాంబయ్య కుమారుడు, తెలుగుదేశం నాయకులు పల్లపోలు నాగమనోహర్ లోహియా మాట్లాడుతూ వేటపాలెం మున్సిపాలిటీ రద్దు చేయించారని, మోటుపల్లి ఎత్తిపోతల పథకం నిర్మించారని, వేటపాలెం సర్పంచిగా పని చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ విశ్రాంత మేనేజర్ శ్రీనివాసరెడ్డి, మాజీ సైనికుడు కృష్ణ, జర్నలిస్ట్ శివారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధి బట్ట వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, గుర్రాల శేషుకుమారి, పసుపులేటి వసంతకుమారి, గీతాలక్ష్మి, సీపీఎం మహిళా ప్రతినిధి బొమ్మిడి విజయనిర్మల, ఎం సుభాషిణి, యెనుమల ఈశ్వరమ్మ, రామిశెట్టి సాయిశ్రీ పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు

ప్రజాదరణ ఎప్పటికీ మర్చిపోలేను

పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ప్రేమ, ఆదరణ ఎప్పటికీ మర్చిపోలేనని, ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. తనతోపాటు తన తనయుడు గౌరీ అమర్నాథ్ పుట్టినరోజు వేడుకలు స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో టిడిపి నియోజకవర్గం అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో పర్చూరు, బాపట్ల శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మ హాజరై తమ సహచరుడైన ఎమ్మెల్యే కొండయ్యతో కేక్ కటింగ్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండయ్య, ఆయన తనయుడు గౌరీ అమర్నాథ్ ఇద్దరు ఒకే రోజు పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఎంతో అరుదైన విషయమని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల ఆదర అభిమానాలు పొందారని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యకర్తలు, పూల వర్షంతో కొండయ్యను ఆహ్వానించారు. ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్, 5వ వార్డు కౌన్సిలర్ సురగాని లక్ష్మీ, నరసింహారావు దంపతులు, టిడిపి నాయకులు సిద్ధి బుచ్చేశ్వరావు హాజరై పూలమాలలతో సత్కరించారు.

ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి పనిచేసిన నాయకులు, యువజన విభాగం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు స్కూటీలు ఎమ్మెల్యేలు కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ పంపిణీ చేశారు.

శిల్పాలకు జీవం పోస్తున్న అగస్టీన్

శిల్పకళలో దశాబ్ద కాలంగా బాపట్ల వాసి సేవలు

అంబేద్కర్ విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న అగస్టీన్

ప్రజాశక్తి - బాపట్ల

రూపమున్న హృదయం లేని సజీవ శిల్ప సౌందర్యానికి ఆకృతి కల్పిస్తూ రమ్యమైన శిల్పకళలో అద్భుతంగా బాపట్లకు చెందిన జాన్ అగస్టిన్ రాణిస్తున్నారు. దశాబ్ద కాలంగా శిల్పకళా రంగంలో తనకంటూ ప్రత్యేకత సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్తున్నారు. అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో ఆయన ఆకట్టుకుంటున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో అందమైన శిల్పాలు తయారుచేసి జాతీయ స్థాయిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల వంటి ప్రాంతంలో శిల్పకళా విద్యను బోధించే శిల్ప కళాశాల అవసరమని పేర్కొన్నారు. కదల లేని బొమ్మలకు సజీవ రూపం కల్పిస్తూ శిల్పకళలో రాణిస్తున్నారు. సజీవ రూపం ఉట్టిపడే విగ్రహాలు ఆవిష్కరిస్తూ అందమైన ఆకృతులను అందిస్తున్నారు. బాపట్లలో రమ్యమైన శిల్పకళలో అద్భుతంగా రాణిస్తున్నారు. బాల్యం నుంచే శిల్పకళను నేర్చుకోవాలన్న ఆసక్తితో బాపట్లకు చెందిన జాన్ అగస్టిన్ ఒక దశాబ్ద కాలంగా శిల్పిగా వాసికెక్కారు. శిల్పకళా రంగాన్ని ఎంచుకున్న అగస్టిన్ బాపట్లలోని రామకృష్ణ సేవా సమితిలో ఉండేవారు. అక్కడ వివేకానంద స్ఫూర్తిని నింపే అనేక సందేశాలు ఆయన మదిలో మెదిలాయి. అక్కడి నుండి శిల్ప కళకు శ్రీకారం చుట్టిన ఆయన తిరుగులేని శిల్పిగా రాణిస్తున్నారు. తిరుపతి శిల్ప కళాశాల్లో విద్య అభ్యసించిన ఆయన ఎన్నో అపురూపమైన ఆకృతులకు జీవం పోశారు. ఒక దశాబ్ద కాలంలో వేల విగ్రహాల ద్వారా ఐదు రాష్ట్రాలకు తన శిల్పకళా ప్రతిభతో పరవశింప చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన అనేక శిల్పాలు ఆయన రూపొందించినవే. హైదరాబాద్ అమీర్‌పేట, మైత్రివనంలో ఏర్పాటు చేసే ఒక అందమైన ఆకృతికి తాజాగా జీవం పోస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని శంషాబాద్, మసాబ్ ట్యాంక్, పంజాగుట్ట వంటి అనేక ప్రాంతాల్లో ఆయన రూపొందించిన శిల్పాలు ఆదరణ పొందుతున్నాయి. కొండా బాపూజీ లక్ష్మణ్ వంటి అనేక మంది విగ్రహాలు, జాతీయ నాయకుల విగ్రహాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే అందమైన బొమ్మలు, విలువైన సందేశాన్ని అందించే ఎన్నో కళాత్మక ఆకృతులకు తన ప్రతిభతో జీవం పోశారు. ఎన్నో విగ్రహాలకు సజీవరూపం కల్పిస్తున్నారు. కన్ను మూసి కనుమరుగైన వారి జ్ఞాపకాలు శాశ్వతంగా పది కాలాల పాటు పదిలంగా ఉండే విధంగా ఆయా విగ్రహాల్లో జీవం పోస్తూ సజీవ ఆకృతులు ఆవిష్కృతం చేస్తున్నారు. అధునాతన భవనాలకు అందాన్ని చేకూర్చే అరుదైన బొమ్మలు తయారు చేస్తున్నారు. బాపట్ల వంటి విద్యా కేంద్రంలో శిల్పకళను ప్రోత్సహించే విధంగా కళాశాల అవసరమని పేర్కొన్నారు. ఈ రంగంలో స్థిరపడే వారికి అన్ని విధాల ప్రోత్సాహాన్ని అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు.

నగర వనంలో రూపొందించిన వివిధ ఆకృతులు

శిల్పకారుడు రూపొందించిన కళా ఖండం

ఏల్చూరు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

ఏల్చూరులో గ్రామాభివృద్ధి పనులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామాభివృద్ధికి విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలుగుదేశం నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు దుద్దేల గాలెయ్య తెలిపారు. ఏల్చూరు నుండి సజ్జాపురం వెళ్లే రహదారిపై ఏల్చూరు పొలిమేర వరకు మండల నిధులు రూ.20 లక్షలతో సైడ్ డ్రన్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం బాలికల వసతి గదులకు రూ.1.59కోట్లతో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఉచిత త్రాగునీరు అందించేందుకు రూ.6 లక్షలతో వాటర్ ప్లాంటును నిర్మించినట్లు తెలిపారు. పంచాయతీ నిధులు రూ.21 లక్షలతో గ్రామంలో 21 బోర్లు వేశామని అన్నారు. గ్రామంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన కాపు కళ్యాణ మండపాన్ని రూ.50 లక్షలతో నిర్మాణం పూర్తి చేశామని అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రైతుల నుండి 11.42ఎకరాల భూమి సేకరించి, సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్ వేస్తున్నట్లు తెలిపారు.

ఏల్చూరు గ్రామంలో నిర్మించిన వాటర్ ప్లాంటు

కౌన్సిలింగ్ వద్ద ఎంటిఎస్ టీచర్ల నిరసన

- దూరప్రాంతాల్లో పనిచేయలేం..
- తాము పని చేసే చోటే కొనసాగించాలి...
- అధికారుల హామీతో ఎట్టకేలకు కౌన్సిలింగ్ కు అంగీకారం..
- రాత్రి 7.15కు కౌన్సిలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలో ఎంటిఎస్ టీచర్ల ఖాళీలు మొత్తం మారుమూల ప్రాంతాల్లో పట్టణాలకు అత్యంత దూరంగా చూపారని, 200 కిలోమీటర్ల దూర ప్రాంతాల్లో తాము పనిచేయలేమని ఎంటిఎస్ టీచర్స్ కౌన్సిలింగ్ ను బహిష్కరించారు. ఆదివారం నాడు జిల్లాలోని 233 మంది ఎంటిఎస్ టీచర్ల కౌన్సిలింగ్ ప్రక్రియను మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక డిఆర్ఆర్ఎం స్కూల్ లో చేపట్టారు. ఉదయాన్నే కౌన్సిలింగ్ హాల్ వద్దకు హాజరైన అభ్యర్థులు తాము కౌన్సిలింగ్ బహిష్కరిస్తున్నట్లు వారు ప్రకటించారు. దీంతో 9 నియోజకవర్గాల పరిధిలో 828 ఖాళీలు ఉన్నట్లు మరో జాబితా ప్రకటించింది. జిల్లా విద్యా శాకాధికారులు 233 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ చేపట్టడానికి నిబంధనలు ప్రకారం తొలుత 20 శాతం అదనంగా మరో 55 కలిపి 288 ఖాళీలు చూపారు.అదే విధంగా అభ్యర్థుల సీనియారిటీ లిస్టు కూడా ప్రకటించారు.

జిల్లా కేంద్రం, ప్రాధాన మైన పట్టణాలు, మండల కేంద్రాల సమీపంలోను అద్దంకి, చీరాల, పర్చూరు, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఒక్క ఖాళీ కూడా చూపలేదని కేవలం రూ.32 వేల వేతనంతో రెగ్యులర్ టీచర్ స్థాయిలో పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం వివక్షత చూపుతుందని, అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న తాము దూర ప్రాంతంలో పని చేయలేమని కౌన్సిలింగ్ బహిష్కరిస్తున్నట్లు సంఘ నాయకులు చంద్రమౌళి ప్రకటించారు. తాము కౌన్సిలింగ్ కు హాజరు కాలేమని, తమకు న్యాయం చేయాలని కౌన్సిలింగ్ ప్రాంగణం గేట్ వద్ద నిరసన కు దిగారు. ఆర్ జె డి, డిఇ ఒ ఇతర అధికారులు నచ్చచెప్పినా అంగీకరించని ఉపాధ్యాయులు,రాత్రి 7.15 వరకు నిరసన కొనసాగించారు. ఖాళీల్లో ఎటువంటి మార్పు ఉండవని, ఏ రోజు అయినా ఇదే పరిస్థితి ఉంటుందని డి ఇ ఒ స్పష్టం చేశారు. కిన్సిలింగ్ కు హాజరు కాని పక్షాన నిబంధనల ప్రకారం ఆబ్సెంట్ గా పరిగనణి స్తామని హెచ్చరించారు. దీంతో టీచర్లు కౌన్సిలింగ్ కు హాజరువుతామని ప్రకటించడం తో కౌన్సిలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

కౌన్సిలింగ్ ప్రారంభించిన డిఇఒ

ఆర్‌జెడితో సంప్రదింపులు..

జిల్లాలో ఉన్న ఖాళీలు మొత్తం చూపామని, కౌన్సిలింగ్ బహిష్కరణ తగదని డిఇఒ ఎ కిరణ్ కుమార్ ఎంటిఎస్ టీచర్స్ సంఘ నేతలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తప్తి చెందక పోవడం తో డిఇఒ టీచర్స్ సంఘ నాయకుడు చంద్రమౌళి చేత ఆర్ జెడి లింగేశ్వర రెడ్డి తో ఫోను లో మాట్లాడించారు. ప్రస్తుతం కొంతకాలం అక్కడ పనిచేస్తే ఖాళీలు ఏర్పడినప్పుడు దగ్గర ప్రాంతాలకు అవకాశం కల్పిస్తామని ఆర్ జె డి సూచనలకు ససేమిరా అంగీకరించని ఉపాధ్యాయులు, ప్రతిసారి ప్రభుత్వం తమను మోసం చేస్తుందని, తాము ప్రస్తుతం పనిచేసే చోట కొనసాగించాలని, లేదా తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనం కు పనిచేస్తున్న తాము దూర ప్రాంతాల్లో, పిల్లలు విద్యావసరాలు, కుటుంబ అవసరాలు తీర్చు కోలేమని, మానవతా దక్పథం తో తమకు న్యాయం చేయాలని కోరారు. టీచర్స్ డిమాండ్ లు తీర్చే అధికారం తనకు లేదనీ, రాత పూర్వకంగా వినతిపత్రం ఇస్తే కమిషనర్ దష్టికి తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. దీనితో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని డిఇఒ ఆర్ జె డికి పంపారు..

నిరసన చేపట్టిన ఎంటిఎస్ టీచర్లు..

కౌన్సిలింగ్ కు హాజరయ్యే వారు హాజరు కావాలని మైకులో అనౌన్స్ చేసినా ఎవ్వరూ స్పందించలేదు. తమను పని చేసే చోట కొనసాగించాలని, లేదా రెగ్యులర్ చేయాలనీ కౌన్సిలింగ్ ప్రాంగణం గేట్ ఎదుట బైటాయించి నిరసన చేపట్టారు. పలు ఉపాధ్యాయ సంఘ నేతలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. తమకు న్యాయం చేయాలని అప్పటి వరకు కౌన్సిలింగ్ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

తాజాగా 828 ఖాళీలు చూపిన విద్యా శాఖ....

ఈ రోజు ప్రకటించిన ఖాళీల్లో కూడా పశ్చిమ ప్రాంతం లో ఎక్కువ ఖాళీలు చూపడం గమనార్హం. జిల్లాలో చూపించిన 828 ఖాళీల్లో సుమారు సగం 355 ఖాళీలు యర్రగొండపాలెం నియోజకవర్గం లో ఉండడం గమనార్హం. కనిగిరి నియోజకవర్గం లో 142,దర్శి నియోజకవర్గం లో 120,,మార్కాపురం నియోజకవర్గం లో 87,గిద్దలూరు నియోజకవర్గం లో 70, కొండపి నియోజకవర్గం లో 26, కందుకూరు నియోజకవర్గం లో 23, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి ఖాళీలు చూపించారు. నిన్న కేవలం 288ఖాళీలు చూపిన విద్యాశాఖ ఈ రోజు 828 ఖాళీలు ప్రకటించడం తో జిల్లా లో ఇంకా పెద్ద మొత్తం లో ఖాళీలు ఉంటాయని సంఘ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు.

ఆలస్యం గా కౌన్సిలింగ్ ప్రారంభం

జిల్లాలో ఉన్న ఖాళీల్లో ఎటువంటి మార్పు లేదనీ, కిన్సిలింగ్ కు హాజరు కాకుంటే నిబంధనలు ప్రకారం ఆబ్సెంట్ గా పరిగణిస్తామని డిఇఒ ప్రకటించడం తో. రాత్రి 7.15 గంటలకు ఉపాధ్యాయులు ధర్నా ఉపసంహరించారు. దీంతో రాత్రి 7.15 గంటలకు డి ఇ ఒ కిరణ్ కుమార్ కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించారు.

నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో..

పారదర్శకంగా వైద్యసేవలు

- జిల్లాలో రూ.192.70 కోట్లతో సర్జరీలు
- 5.76 లక్షల పిఎంజెఏవై కార్డులు పంపిణీ
- వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలు
- ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.హేమంత్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.హేమంత్ కుమార్ తెలిపారు. జిల్లాలో 82,636 సర్జరీలు చేసినందుకు ప్రభుత్వం 192.70 కోట్లు విడుదల చేసిందన్నారు. జిల్లాలోని నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా పారదర్శకంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో పిఎంజెఏవై పథకానికి సంబంధించి 5.76 లక్షల కార్డులు పంపిణీ చేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను జిల్లా కోఆర్డినేటర్ ప్రజాశక్తికి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఎన్టీఆర్ వైద్య సేవలో జిల్లా ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందిస్తున్నాం. నెట్ వర్క్ హాస్పిటల్‌లోని ఆరోగ్య మిత్ర ద్వారా ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నాం. ప్రజలు కోరుకున్న నెట్ వర్క్ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆయా నెట్‌వర్క్ హాస్పిటల్స్ అందించిన సేవలకు గాను ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారు.



జిల్లాలో 132 నెట్‌వర్క్ హాస్పిటల్స్

ప్రకాశం జిల్లాలో మొత్తం 132 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఇందులో కార్పొరేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ 43, ప్రభుత్వ నెట్‌వర్క్ హాస్పిటల్స్ 77, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(డెంటల్) నెట్‌వర్క్ హాస్పిటల్స్ 12 ఉన్నాయి. ఆయా నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ప్రజలు రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయాలు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలు కోరుకున్న నెట్‌వర్క్ హాస్పిటల్‌లో వైద్య సదుపాయాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో 82,636 సర్జరీలు

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 82,636 సర్జరీలు చేసినందుకు 192.70 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఒంగోలు నియోజకవర్గంలో 11,968 సర్జరీలకు 30.72 కోట్లు, కొండపిలో 11,227 సర్జరీలకు 26.14 కోట్లు, దర్శిలో 10,119 సర్జరీలకు 23.07 కోట్లు, కనిగిరిలో 7269 సర్జరీలకు 18.58 కోట్లు, యర్రగొండపాలెం నియోజకవర్గంలో 11,165 సర్జరీలకు 24.51 కోట్లు, గిద్దలూరులో 12,500 సర్జరీలకు 27.47 కోట్లు మార్కాపురంలో 7890 సర్జరీలకు 18.78 కోట్లు, సంతనూతలపాడు నియోజకవర్గంలో 10,498 సర్జరీలకు 23.42 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

5.79 లక్షల పిఎంజెఏవై కార్డులు పంపిణీ

జిల్లాలో 5,79,288 పిఎంజెఏవై కార్డులు పంపిణీ చేశాం. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 76128 కార్డులు, కొండపిలో 83880 కార్డులు, దర్శిలో 75432 కార్డులు, కనిగిరిలో 65160 కార్డులు యర్రగొండపాలెం నియోజకవర్గంలో 81,144 కార్డులు, గిద్దలూరులో 65744 కార్డులు, మార్కాపురంలో 54312 కార్డులు, సంతనూతలపాడు నియోజకవర్గంలో 73,488 కార్డులు అందజేశాం.

వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలు

జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ వినియోగించుకోవాలి. జిల్లాలోని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌లో నమోదైన జర్నలిస్టులకు అవసరమైన వైద్య సదుపాయాలు అందించనున్నాం. రానున్న కాలంలో అందరి సహకారంతో ఎన్టీఆర్ వైద్య సేవలో మరిన్ని వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తా.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఉద్యోగస్తుల బదిలీల గురించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి హెచ్చరించారు. కొత్తగా ఏర్పాటైన, వెనుక బడిన బాపట్ల జిల్లాను దష్టిలో పెట్టుకుని వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న వైద్యులను కొన్నిచోట్ల రిలీవ్ చేయలేదని, ప్రస్తుతం పనిచేస్తున్న వారి స్థానానికి నూతన వైద్యులు చేరే వరకు అక్కడ ఉన్నవారే విధులు నిర్వర్తించాల్సి ఉందన్నారు. ప్రజల ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని జిల్లాలో కొన్నిచోట్ల వైద్యులను రిలీవ్ చేయలేదని తెలిపారు. అందులో భాగంగానే వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల అంశం సీరియస్‌గా తీసుకున్నామన్నారు. బదిలీల అంశాన్ని సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలకు పాల్పడితే చట్టప్రకారంగా చర్యలు తప్పవన్నారు.